ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సంతోష్

కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్లు

గద్వాల, జూన్ 3: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని రెండు అసెంబ్లీ సెగ్మెంట్‌లు గద్వాల, అలంపూర్ పరిధిలో పోలైన ఓట్ల లెక్కింపు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సంతోష్ తెలిపారు. నాగర్‌కర్నూల్ వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాంలో నిర్వహించే ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను వనపర్తి కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. మంగళవారం ఉదయం 8గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించేందుకు వీలుగా కౌంటింగ్ సిబ్బందిని అన్నివిధాలా సన్నద్ధం చేశామన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియపై ఇప్పటికే పలు విడుతలుగా శిక్షణ తరగతులు నిర్వహించి అవగాహన కల్పించామన్నారు. ఎలాంటి పొరపాట్లు, గందరగోళానికి తావులేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. పోలైన ఓట్ల లెక్కింపు కోసం గద్వాల సెగ్మెంట్‌కు 16, అలంపూర్ సెగ్మెంట్‌కు 14 చొప్పున టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. 18 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తవుతుందని, మధ్యాహ్నం మూడు గంటలకు కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్, ఆర్డీవో రాంచందర్ ఉన్నారు.

కరుణించిన వరుణుడు

- రాష్ట్రంలోనే అత్యధికంగా రాజోళిలో 147మి.మీ. వర్షపాతం
- పొంగిన వాగులు, వంకలు

వానకాలం సీజన్‌లో రైతులు సాగుకు సమాయత్తమవుతున్న వేళ వరుణుడు కరుణించాడు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు కురిసిన వర్షంతో వాగులు, వంకలు పారాయి. రాష్ట్ర వ్యాప్తంగా రాజోళి మండలంలో అధికంగా 147మి.మీ.లు, జోగులాంబ గద్వాల జిల్లాలో అత్యల్పంగా గట్టు మండలంలో 38.4మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

మారమునగాలలో రోడ్డుపై పారుతున్న వాగు

రాజోళిలో 14.7 సెం.మీ. వర్షం

రాజోళి,జూన్ 3 : మండలకేంద్రంలో ఆదివారం రాత్రి 10గంటలకు ప్రారంభమైన వర్షం సోమవారం ఉదయం 8గంటల వరకు ఎడతెరిపి లేకుండా కురిసింది. దీంతో ప్రధాన రహదారులు నీటిమయమై కాల్వలు, వాగులు నదులను తలపించాయి. తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధికంగా రాజోళిలో 14.7 సెంటిమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తాసీల్దార్ హరికృష్ణ తెలిపారు.

ఉండవెల్లిలో 11సెం.మీ. వర్షపాతం

ఉండవెల్లి, జూన్ 3 : మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం తెల్లవారుజాము నుంచి ఉదయం 8గంటలకు వరకు భారీ వర్షం కురిసింది. దీంతో వివిధ గ్రామాల్లోని వాగులు, వంకలు పొంగిపోర్లాయి. సమృద్ధిగా వర్షం కురువడంతో అన్నదాతలు సాగుకు సిద్ధమయ్యారు. సోమవారం కురిసిన వర్షం మండలకేంద్రంలో 11సెం.మీ.గా నమోదు కాగా గ్రామాల్లో 9.7సెం.మీ. వర్షపాతంగా నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు.

మానవపాడులో భారీ వర్షం

మానవపాడు, జూన్ 3 : మండలకేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం 8గంటల వరకు భారీ గాలులు, ఉరుములతో కూడిన వర్షం కురిసింది. ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు వర్షం కురువడంతో ఉపశమనం కలిగింది. పంట పొలాల్లో పనులు చేసుకునేందుకు అనువైనం వర్షం కురువడంతో రైతులు పొలం పనులకు సిద్ధమయ్యారు. సోమవారం 60.4మిల్లీమీటర్ల వర్షపాతం కురిసినట్టు తాసీల్దార్ కార్యాలయ సిబ్బంది తెలిపారు.

55.6 మిల్లీ మీటర్ల వర్షపాతం

మల్దకల్, జూన్ 3: మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజామున వరకు ఓ మోస్తరు వాన కురిసింది. మండలంలో మొత్త 55.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తాసీల్దార్ జుబేర్ మొహిన్‌ద్దున్ తెలిపారు. ఈ వర్షంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

అయిజలో 47 మి.మీ.వర్షపాతం

అయిజ, జూన్ 3 : అయిజ మున్సిపాలిటీతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఉదయం 4:30గంటల నుంచి 9గంటల వరకు ఎడతెరిపిలేకుండా ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. అయిజ పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో 47. మి.మీ. వర్షపాతం నమోదైనట్లు తాసీల్దార్ జ్యోతి తెలిపారు. అక్కడక్కడ స్వల్పంగా వాగులు, వంకలు ప్రవహించాయి. పత్తి, కంది, వేరుశనగ, ఆముదం వంటి పంటల సాగుతోపాటు మిరప నారుమళ్లు పోసుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే అడపాదడపా కురిసిన వానలకు సీడ్ పత్తి సాగు చేసిన రైతులు ఇతర పంటల సాగువైపు దృష్టి మరల్చారు. పట్టణంలోని పలు కాలనీల్లో వర్షం నీరు రోడ్లపై నిలిచాయి.

గట్టులో అత్యల్పం

గట్టు, జూన్ 3: రాష్ట్రంలో జోగులాంబ గద్వాల జిల్లాలోని రాజోళి మండలంలో అధిక వర్షపాతం నమోదైనట్లు అర్థగణాంకశాఖ వెబ్‌సైట్ సోమవారం వెల్లడించింది. జిల్లాలోని మండలాల్లో రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. రాజోళిలో అధికంగా 147మి.మీ. వర్షపాతం నమోదుకాగా తక్కువగా 38.4 మి.మీ.ల వర్షపాతం గట్టు మండలంలో నమోదైంది. ఇక కేటీదొడ్డిలో 81.1మి.మీ., ధరూర్‌లో 83.7మి.మీ., గద్వాలలో 57.4మి.మీ,ఇటిక్యాలలో 39.4మి.మీ, మల్దకల్‌లో 58.4 మి.మీ, అయిజలో 47.6మి.మీ., వడ్డేపల్లిలో 102 మి.మీ. మానవపాడులో 49.7మి.మీ. ఉండవెల్లిలో 97.4 మి.మీ., అలంపూర్‌లో 100.మి.మీ.ల వర్షపాతం నమోదైంది.

భారీ వర్షానికి పొంగిన వాగులు

అయిజ రూరల్, జూన్ 3 : మండలంలోని సంకాపురం, ఈడిగోనిపల్లి, వెంకటాపురం, కిష్టాపురం, ఎక్లాస్‌పురం తదితర గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షానికి సంకాపురం నుంచి ఈడిగోనిపల్లికి వెళ్లే రహదారిలో ఉన్న వాగు పొంగి పొర్లింది. వర్షం రాకతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

రాజోళి మండల కేంద్రంలో పొంగుతున్న వాగు

అయిజ ఆర్అండ్‌బీ అతిథి గృహం సమీపంలో చేరిన వర్షం నీరు

అయిజ మండలంలో వర్షానికి ప్రవహిస్తున్న వాగు

అభిరుచికి ప్రాణం పోస్తున్న కళాకారుడు

చిత్రలేఖనంలో శిక్షణ పొందుతున్న చిన్నారులతో సాహితీ కళా సభ్యులు

వనపర్తి, జూన్ 3: పిల్లలోని అభిరుచికి ప్రాణం పోస్తున్న కళాకారుడు బస్వ లింగయ్య అని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్ అన్నారు. సోమవారం పట్టణంలోని బస్వలింగయ్య నిర్వహిస్తున్న చిత్రకళ క్యాంప్‌ను సాహితీ కళా వేదిక సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దాదాపు 30 మంది విద్యార్థులకు చిత్రలేఖనంలో శిక్షణ అందిస్తున్నారని, శిక్షణలో చిన్నారులు అద్భుతమైన కళను ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు. నేటి పరిస్థితుల్లో చిన్నారులు సెలవుల్లో చదువే కాకుండా ఇతర వ్యాపకాలకు పోకుండా చిత్రలేఖనంలో శిక్షణ పొందడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సాహితీ కళా సభ్యులు జనజ్వాల, బైరోజు చంద్రశేఖర్, గంధం నాగరాజు, బండారు శ్రీనివాసు, బాబు, విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలను అవమానపర్చుతున్న సీఎం

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్

ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వనపర్తి, జూన్ 3: తొలి, మలిదశ తెలంగాణ పోరాటంలో ఎంతోమంది బలిదానాలతో సాధించుకున్న తెలంగాణను సీ ఎం రేవంత్‌రెడ్డి అవమానపర్చారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ పేర్కొన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పిలుపుమేరకు బీఆర్ఎస్ పట్టణ నాయకత్వం ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన అవకాశంతో ప్రజాపాలన చేయకుండా ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించే విధంగా సీఎం మాట్లాడుతుండడం విడ్డూరంగా ఉందన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు పరిపాటిగా ఉంటాయని, ప్రజ లు ఇచ్చిన అవకాశాన్ని బట్టి పరిపాలన అందించాల్సి ఉటుందన్నారు. కా నీ అవగాహన, పరిణితి, పరిపక్వత లేని తెలివితక్కువ తనం, సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తి త్వం ఇప్పుడిప్పుడే ప్రజలకు ఆర్థమవుతుందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ సారథ్యంలో 14ఏండ్ల సుదీర్ఘ పోరాటంతో తెలంగాణను సాధించుకొని, పదేండ్ల పరిపాలనలో తెలంగాణను సస్యశ్యామలంగా చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. తెలంగాణను దేశంలో అన్నపూర్ణ రాష్ట్రంగా అగ్రభాగాన నిలిపారన్నారు. ప్రజాపాలన మర్చి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు అవసరంలేని వాటిని ముందుకు తీసుకొచ్చి కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఒక్క ఉచిత బస్సు ప్రయాణం తప్పా మరొకటి ముందుకు సాగలేదన్నారు. నేడు ఓడినా రానున్న రోజుల్లో బీఆర్ఎస్ మరింత బలోపేత దిశగా ప్రయనిస్తుందని, ప్రభుత్వానికి ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రజలతో కలిసి పోరాటం చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, కౌన్సిలర్లు బండారు కృష్ణ, నాగన్నయాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లక్ష్మయ్య, వేణుగోపాల్ నాయుడు, పరంజ్యోతి, తిరుమల్‌నాయుడు, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, రహీం, గంధంనాగరాజ్, డ్యానియేల్, ఇంతియాజ్, పోతుపల్లిరాజు, వెంకటేశ్, రమేశ్ రవికుమార్, మనోజ్, వెంకట్, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

శివుడి విగ్రహ నిర్మాణానికి విరాళం

కొత్తకోట, జూన్ 3: మండలంలోని కానాయపల్లి స్టేజీ సమీపంలో ఉన్న దత్తకోటిలింగేశ్వర ఆలయంలో ధాన్య మందిరం ఏర్పాటు చేసే శివుడి విగ్రహ నిర్మాణానికి వనపర్తికి చెందిన సీఎస్ఆర్, ఫిల్లింగ్ స్టేషన్ యజమాని చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు సోమవారం రూ.81వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అంతకుముందు శివలింగానికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కండక్టర్ శేఖరయ్య, మహేశ్వర్, అర్చకులు అనిల్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీరు తొలగింపు

ధరూరు, జూన్ 3: ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి మండల కేంద్రంలో వైఎస్సార్ చౌరస్తా సమీపంలో ఎరుకలి గేరి వద్ద వర్షపు నీరు రోడ్డుపైనే నిలిచిపోయింది. వాహనదారులకు తీవ్ర ఇబ్బంది కలగడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి చొరవ చూపించి జేసీబీతో మూసుకుపోయిన కలవర్టు వద్ద మట్టి తీయించారు. దీంతో రోడ్డుపైన వర్షపు నీరు డ్రైనేజీ ద్వారా దిగువకు వెళ్లడంతో వాహనదారులు ఇబ్బంది లేకుండా వెళ్లారు. కార్యక్రమంలో ఆయన వెంట గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో బోరుబావికి పూజలు

గోపాల్‌పేట, జూన్ 3: మండల కేంద్రంలోని ఎస్సీ శ్మశానవాటికలో గ్రామానికి చెందిన కరొళ్ల భాస్కర్ (విద్యుత్ లైన్ మెన్) తమ సొంతఖర్చుతో బోరు వేయించి నీటి వసతి కల్పించారు. సోమవారం బోరుకు మోటర్ బిగించి నీళ్లు బయటకు కొట్టారు. బోరు వద్ద కొబ్బరికాయలు కొట్టి పూజ చేశారు. అదేవిధంగా ఆయన సొంత ఖర్చుతో శ్మశానవాటికకు విద్యుత్ సౌకర్యం కల్పించి లైట్లు వేయించారు. షెడ్డు నిర్మాణంలో ఉన్నది. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, గ్రామస్తులు బాలస్వామి, గోపాల్, శివన్న, కుర్మయ్య, బాలు, బాలరాజు, రాజశేఖర్, కొండయ్య, వెంకటయ్య, నాగయ్య, రాజన్న, ఓంకార్ పాల్గొన్నారు.

అదుపు తప్పి బండల లారీ బోల్తా : డ్రైవర్‌కు గాయాలు

కొత్తకోట, జూన్ 3: మండలంలోని మీరాసిపల్లి స్టేజీ సమీపంలో సోమవారం ఉదయం 44వ జాతీయ రహదారిపై బండల లారీ అదుపు తప్పి బోల్తా పడింది. కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ మీరాసిపల్లి స్టేజీ సమీపంలోకి రాగానే డ్రైవర్ అజాగ్రత్త వల్ల బోల్తా పడినట్లు పోలీసులు తెలిపారు. డ్రైవర్ సంతోష్‌కు గాయాలు కాగా.. వెంటనే 108లో ఏరియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మంజునాథ్ రెడ్డి తెలిపారు.

960కిలోల నల్లబెల్లం పట్టివేత

కొత్తకోట, జూన్ 3: అక్రమంగా తరలిస్తున్న 960 కిలోల నల్లబెల్లాన్ని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ కరుణ తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. కొల్లాపూర్ మండలం నార్లాపూర్‌కు చెందిన సాంబ ఆటోలో హైదరాబాద్ నుంచి 960 కిలోల నల్లబెల్లం, 10కిలోల ఆలం, 6లీటర్ల నాటుసారా తీసుకొని కొల్లాపూర్‌కు వస్తుండగా ఆదివారం రాత్రి కొత్తకోటలో పట్టుకున్నట్లు తెలిపారు. వాహనం అనుమానం వచ్చి తనిఖీ చేయగా బెల్లంతోపాటు సారా కూడా ఉన్నట్లు తెలిపారు. సాంబను అరెస్టు చేసి టాటా ఏసను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో సీఐ బాలకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్సై నాగరాజు తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో బర్రె మృతి

వనపర్తి,జూన్ 3: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్‌సర్క్యూట్‌కు గురై గేదె మృతిచెందిన ఘటన మండలంలోని అంకూర్ శివారులో చోటుచేసుకున్నది. అంకూర్‌కు చెందిన పోతుల శంకర్‌రెడ్డి గేదె గడ్డి మేస్తూ రోడ్డుపక్కన ఓ రైతు పొలంలో ఉన్న ట్రాన్స్‌పార్మర్‌కు తగిలి చనిపోయినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశారు. గేదె విలువ సుమారు రూ.75 వేలు ఉంటుందని తెలిపారు.

ఎమ్మెల్యే దంపతులకు సన్మానం

గద్వాల అర్బన్, జూన్ 3: ఉమ్మడి మహబుబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం కోసం కృషిచేసిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దంపతులను సోమవారం జిల్లా కేంద్రంలోని నివాసంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి దంపతులు మార్యదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ దంపతులు

ఎమ్మెల్సీని సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు

మల్దకల్/ధరూర్ జూన్ 3 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నవీన్‌కుమార్‌రెడ్డి గెలుపొందారు. గెలుపొందిన అనంతరం ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి సోమవారం గద్వాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ క్యాంప్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డిని ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ తిమ్మారెడ్డి, ఎంపీటీసీలు పెద్దగోపాల్‌రెడ్డి, జయమ్మా నర్సింహులు, లక్ష్మన్న, నాయకులు నరేందర్, మధు, తూంకృష్ణారెడ్డి, సవారన్న, పరశురాముడు, తిమ్మరాజుతో పాటు వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పూలమాల, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అలాగే ధరూర్ మండల నాయకులు కూడా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు డీఆర్ విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, కేటీదొడ్డి జెడ్పీటీసీ రాజశేఖర్, ఎంపీటీసీలు రాఘవేందర్‌రెడ్డి, దౌలన్న, మాజీ సర్పంచ్ మహబూబ్, కేటీదొడ్డి మండలాధ్యక్షుడు ఉరుకుందు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే, ఎమ్మెల్సీని సన్మానిస్తున్న ఎంపీపీ, పార్టీ నాయకులు

కరాటే విద్యార్థులకు బెల్టుల ప్రదానం

బెల్టులు సాధించిన కరాటే విద్యార్థులు

కొత్తకోట, జూన్ 3: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో గాడ్స్ ఆన్ వారియర్స్ కరాటే క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గ్రేడింగ్ టెస్టులను నిర్వహించి బెల్టులను ప్రదానం చేసినట్లు క్లబ్ ఫౌండర్ ఎస్‌కే నబీ తెలిపారు. ఈ బెల్టుల్లో పది బ్లాక్ బెల్టులు ప్రదానం చేయగా, 20 మంది విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచిన వారికి బెల్టులను ప్రదానం చేసినట్లు తెలిపారు. వీరిలో ఎల్లో బెల్టు సాధించిన వారిలో శ్రీకాంత్, ఆదిత్‌రెడ్డి, జశ్వంత్, విజ్ఞాశ్రీ, పరమేశ్‌గౌడ్, సాయి, కౌశిక్, తులసి, ఆరెంజ్ బెల్టు సాధించిన వారిలో శ్రీవిద్య, గౌతమ్, పవన్, మధుగౌడ్, బ్లూ బెల్టులో ఆదిత్య, శ్రీవల్లభ, మెరూన్ బెల్టు సాధించిన వారిలో లక్ష్మీకాంత్, సాయిచరణ్, రోహిత్, మేఘన, బ్లాక్ బెల్టులు సాధించిన వారిలో ఏకాంబరి, యోగేశ్వరి, అనిత, సురేందర్, అరవింద్, శివకుమార్‌యాదవ్ సాధించారు. వారికి సర్టిఫికెట్‌తోపాటు బెల్టులను క్లబ్ ఫౌండర్ అందజేశారు. కార్యక్రమంలో హరీశ్‌యాదవ్, జాఫర్, సాదిక్, బాబా, అజ్మీర్, లాస్య, కార్తీకేయ, ఎస్‌కే గౌస్ ఉన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

వీపనగండ్ల, జూన్ 3: రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే సంబంధిత విత్తన దుకాణాలపై చట్టపరమైన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి ఢాకేశ్వర్ గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆగ్రోస్ సేవాకేంద్రం, భవానీ ట్రేడర్స్, అక్షర ట్రేడర్స్ విత్తన దుకాణాలపై జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం, మండల టాస్క్‌ఫోర్స్ బృందంతో కలిసి ఆయన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలన్నారు. సీడ్స్ దుకాణాల్లో విత్తన పంపిణీ వివరాలు నమోదు చేసి ఉంచాలన్నారు. నకిలీ విత్తనాల అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం అధికారి చంద్రశేఖర్, కొత్తకోట ఏడీఏ దామోదర్, హెడ్ కానిస్టేబుల్ బీరయ్య పాల్గొన్నారు.

శ్రీరంగాపురంలో విత్తనాలను పరిశీలిస్తున్న ఏవో, ఎస్సై

పెబ్బేరు మండలంలో..

పెబ్బేరు, జూన్ 3: రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే దుకాణాల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉమ్మడి మండల వ్యవసాయాధికారి చంద్రమౌళి హెచ్చరించారు. సోమవారం పెబ్బేరు, శ్రీరంగాపురం మండలాల్లోని విత్తనాల దుకాణాలను పోలీసుల సాయంతో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విత్తనాలు అమ్మిన తర్వాత రైతుల వివరాలు తప్పకుండా రిజిస్టర్లలో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీరంగాపురం ఎస్సై వెంకటస్వామి, పెబ్బేరు హెడ్‌కానిస్టేబుల్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ తరగతులు

మదనాపురం, జూన్ 3: గ్రామీణ యువతకు సేంద్రియ వ్యవసాయంపై ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కేవీకే సీనియర్ శాస్త్రవేత్తలు రాజేందర్‌రెడ్డి, సురేశ్‌కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. నైపుణ్య భారత్‌లో భాగంగా భారత ప్రభుత్వం వారి ఆర్థిక సాయంతో గ్రామీణ యువత, యువ రైతులకు సేంద్రియ వ్యవసాయంపై 25 రోజుల వ్యవసాయ నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని జూన్ 2వ వారం నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు కనీసం 6వ తరగతి వరకు చదువుకొని ఉండాలని, 18–40ఏండ్లలోపు ఉండాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగినవారు జూన్ 9వ తేదీలోగా పాస్ ఫొటో, ఆధార్‌కార్డు జిరాక్స్, చదువు ధ్రువీకరణ పత్రం, అప్లికేషన్ ఫారం జతచేసి మదనాపురంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో తమ పేరు రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. శిక్షణ పొందిన అభ్యర్థులకు (ఏఎస్సీఐ–జీవోఐ) నుంచి సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల అర్బన్, జూన్ 3: షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు లా గ్రాడ్యుయేట్ చేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి శ్వేత ప్రియదర్శిని సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆమె తెలియజేస్తూ అర్హత ఉన్న ఎస్సీ గ్రాడ్యుయేషన్ అందరికీ శాచురేషన్ పద్ధతిలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునేవారు ఈనెల 7వ తేదీ నుంచి జూలై 6వ తేదీలోగా టీపాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థుల ఎంపిక జూలై 15తేదీన జరుగుతుందని, అనంతరం నెలకు రూ.3చొప్పున మూడేండ్లపాటు ఇవ్వనున్నట్లు, డిజిటల్ బుక్స్, కంప్యూటర్, ఫర్నీచర్, లాయర్ డ్రెస్ కోసం రూ.50వేలు పెంచి ఒకేసారి మంజూరు చేయనున్నట్లు తెలిపారు. బార్ కౌన్సిల్ వసూలు చేసే వాస్తవ రేటు ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అర్హతగల షెడ్యూల్డ్ కులాలకు చెందిన లా గ్రాడ్యుయేట్‌లకు అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఆర్‌డీటీకి ఎంపికైన విద్యార్థులు

ఉండవెల్లి, జూన్ 3 : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సమీర్ (9.7జీపీఏ), మహాలక్ష్మి (8.7జీపీఏ) సాధించడంతో ఆర్‌డీటీ సంస్థ అందించే స్కాలర్ సిప్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు హేమలత పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లాలో ఆర్‌డీటీ సంస్థ ప్రతి ఏడాది ఇద్దరి విద్యార్థులకు కార్పొరేట్ కాలేజీలో చేర్పించి విద్య పూర్తయి ఉద్యోగాల సాధించే వరకు వారికి అయ్యే ఖర్చులని సంస్థ చెల్లిస్తుందని తెలిపారు. ఇంటర్ విద్య కోసం ఒక్కొ విద్యార్థికి రూ.లక్షా 40వేలు ఖర్చు చేసి వారికి నచ్చిన కార్పొరేట్ కాలేజీలో చేర్పిస్తుందని ఆర్‌డీటీ సంస్థ ప్రతినిధులు రామేశ్వరి, సుదర్శన్‌రెడ్డి, రహాన పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ రైతుసంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

పాన్‌గల్, జూన్ 3: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ హరినాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రధానంగా మలేరియా, డెంగీ, చికున్ గున్యా, ఫైలేరియా, మెదడువాపు తదితర వ్యాధులపై ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. గర్భిణులకు ప్రభుత్వ దవాఖానలో కాన్పులు చేయించాలని కోరారు. సమావేశంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఘటనా స్థలం పరిశీలన

పెబ్బేరు, జూన్ 3: పెబ్బేరులో ప్రైవేట్ పాఠశాల యజమానిపై జరిగిన హత్యాయత్నం ఘటనా స్థలాన్ని సోమవారం ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి పరిశీలించారు. ఘటన జరిగిన తీరును ఆయన ఆరా తీశారు. కేసును వెంటనే ఛేదించాలని పోలీసులను కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-327729-All

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794